క్లుప్తంగా

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందన



డాక్టర్ అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

మహారాణిపేట : కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను ల్యాబ్ టెక్నీషియన్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్‌కుమార్‌ను ల్యాబ్ టెక్నీషియన్ల జిల్లా అధ్యక్షుడు డి.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



కార్యకర్త నీలవేణికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మహ్మద్ సాధిక్

జగదాంబ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ శనివారం ఆర్థిక సహాయం చేశారు. 39వ వార్డు పార్టీ కార్యకర్త సత్యవేణి భర్త మృతి చెందడంతో ఆ కుటుంబం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సాధిక్ వెంటనే సత్యవేణి ఇంటికి వెళ్లి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డులో కార్యకర్తలకు ఎవరికైనా ఇబ్బందులు ఉంటే పార్టీ తరపున తాము అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఆల్వేస్ హెల్ప్ సంస్థ ఔదార్యం



ఆర్థిక సాయం చేస్తున్న ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్ : నగరానికి చెందిన జొన్నాడ నాగశంకరరావు భార్య శ్యామల ఇటీవల గైనిక్ సమస్యతో నగరంలోని ఓ ఆసుపత్రిలో చేరారు. ఆరు నెలల గర్భస్థ సమయంలో తీవ్ర రక్తస్రావం కావడంతో నెలలు నిండకుండానే కవలలకు జన్మనిచ్చారు. అయితే ఆ ఇద్దరు శిశువులు శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నారు. వైద్యానికి లక్షలు ఖర్చవుతాయని డాక్టర్లు తెలిపారు. వారు పేదరికంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి శ్యామల కుటుంబానికి రూ.11,300 ఆర్థిక సాయం అందజేశారు.

రెల్లి కులస్తుల పిల్లలకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

డాబాగార్డెన్స్ : పారిశుధ్య కార్మికులుగా పని చేసి పదవీ విరమణ చేసిన ఎస్సీ రెల్లి కులస్తుల పిల్లలకు ఆ పోస్టుల భర్తీలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్, ఏఐటీయూసీ అధ్యక్షుడు పడాల రమణ శనివారం వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీలో కేంద్ర ప్రభుత్వ సఫారీ కర్మచారి కమిషన్ సభ్యుడు పీపీ వావా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు సత్యనారాయణ, బంగారు సింహాచలం, కిలారి శివ, దుర్గారావు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వెల్లడి
- సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



ఈతలపాక శ్యాంప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధి ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ కార్యకర్తల గ్రీవెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక సామాజిక భవనం ఏర్పాటుతో పాటు కులదైవం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని 39వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మత్స్యకారులు ఎమ్మెల్యే వాసుపల్లికి వినతిపత్రం అందజేశారు. అలాగే పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యేకు పలు విన్నపాలు చేశారు. కార్యకర్తల కోసం ఇళ్లు కేటాయించాలని 41వ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఎమ్మెల్యేని కోరగా, వెంటనే జీవీఎంసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. పలు దేవాలయాలు, ట్రస్టులకు కార్యకర్తలను ట్రస్టీలుగా నియమించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. విశాఖ స్మార్ట్‌సిటీ ఆటో యూనియన్‌కు రాజన్న ఆటోనగర్‌కు కేటాయించిన స్థలంలో శంకుస్థాపనకు సన్నాహాలు చేయాలని అసోసియేషన్ నాయకుడు ఖాజావలీ ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 29వ వార్డు అధ్యక్షుడు, జేసీఎస్ ఇన్‌చార్జి పీతల వాసు, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

2024లో వాసుపల్లిని ఎమ్మెల్యేగా గెలిపిస్తాం..

అరుంధతి అభివృద్ధి సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఈతలపాక శ్యాంప్రసాద్ (చిన్ని) తన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే వాసుపల్లిని మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసిన అనంతరం శ్యాంప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం ఎమ్మెల్యే వెంటే ఉంటూ, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు.

సేవల్లోనే సంతృప్తి

- సొంత నిధులతో ప్రజల దాహార్తి తీరుస్తున్న ఆటో డ్రైవర్
- రోజుకు సుమారు రూ.400 వరకు కేటాయింపు



జగదాంబ జంక్షన్‌లో నిలిపిన దుర్గాప్రసాద్ ఆటో వద్ద మంచినీళ్లు తాగుతున్న సెక్యూరిటీ గార్డ్

డాబాగార్డెన్స్ : రోజంతా కష్టపడితేనే ఇంటిల్లిపాదీ కడుపు నిండే రోజులివి. సామాన్యుడు ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు శ్రమిస్తేనే ఆ కుటుంబం నాలుగు మెతుకులు తినగలుగుతుంది. అటువంటిది తనకు వచ్చే కొద్దిపాటి ఆదాయంలోనే కొంత మొత్తాన్ని సమాజ సేవకు వెచ్చిస్తున్నాడో యువకుడు. ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్న అతను సమాజ సేవలో పునీతుడవుతున్నాడు. గోకుల్ థియేటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ దుర్గాప్రసాద్ చదువుకున్నది తక్కువే. కానీ సమాజసేవ చేయాలన్న తపన అతనిలో మెండుగా ఉంది. బడి పిల్లల్ని నిత్యం స్కూళ్లకు తీసుకెళ్తుంటాడు. ఉదయం పాఠశాలలకు పిల్లల్ని తీసుకెళ్లి.. సాయంత్రం వారి ఇళ్ల వద్ద దింపుతుంటాడు. మధ్యలో బేరాలు కడుతూ కుటుంబ పోషణలో ప్రధానపాత్ర పోషిస్తున్నాడు.

చిన్నతనం నుంచి సేవాదృక్పథం..

దుర్గాప్రసాద్‌కు చిన్నప్పటి నుంచే సమాజ సేవ చేయాలన్న తపన. కానీ డబ్బు లేదు. ఆటో వేస్తూ వచ్చిన ఆదాయంలోనే కొంత సేవలకు వినియోగిస్తున్నాడు. ఆటో వెనుక ఉన్న ఖాళీ భాగంలో వాటర్ ట్యాంక్‌లు పెట్టుకుని ఉచిత మంచినీటి సేవకు గత వేసవిలో శ్రీకారం చుట్టాడు. బేరం కట్టుకుంటూ ప్రధాన జంక్షన్ల వద్ద తన ఆటోను ఓ మూల నిలుపుతాడు. దగ్గరలోని కూలీలు, కార్మికులు, పౌరులు దాహార్తి తీర్చుకునేందుకు అతని ఆటో వద్దకు చేరుకుని ఉచిత చల్లని మంచినీరు తాగుతుంటారు.

నగర ప్రజలకు చల్లటి నీరు..



ఉదయం నుంచి ఫీల్డ్‌లోనే ఉంటాను. చల్లని మంచినీటిని ఉచితంగా నగర ప్రజలకు అందజేస్తుంటాను. రోజుకి 10 నుంచి 12 వాటర్ ట్యాంక్‌ల ద్వారా నగర ప్రజలకు ఉచిత చల్లని మంచినీటిని అందజేస్తున్నాను. దీనికి గాను రోజుకి సుమారు రూ.400 నుంచి రూ.500 వరకు వెచ్చిస్తున్నాను. ఈ సేవలో నాకు తృప్తి దొరుకుతోంది.

-వై. దుర్గాప్రసాద్, ఆటో డ్రైవర్, గోకుల్ స్టాండ్

సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలి

- జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా



మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా

డాబాగార్డెన్స్ : సమాజంలో సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలని జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా పేర్కొన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులు అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సఫాయి కార్మికుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రాలు, మున్సిపాల్టీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. 2013 డిసెంబర్ 6 నుంచి పునరావాస చట్టం అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందన్నారు. మురుగు కాలువలను మాన్యువల్‌గా శుభ్రపరిచే కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పాటుపడుతూ, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నేతలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సీతంరాజు సుధాకర్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 33వ వార్డు వేంకటేశ్వర మెట్ట ప్రాంతానికి చెందిన తాడితూరి ప్రసాద్ గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. పార్టీ కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ శనివారం నేరుగా ప్రసాద్ ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల కోసం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, ఆడారి వెంకటమహేష్, భీశెట్టి రాజు, మదీనాఖాన్, హరి, సంతోష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కోరుతూ చిరు వ్యాపారుల వినతి



కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న చిరు వ్యాపారుల సంఘం నాయకులు

డాబాగార్డెన్స్ : తాము వ్యాపారాలు చేసుకోవటానికి స్థలం కేటాయించాలని 69వ వార్డు పరిధి షీలానగర్ ప్రాంతానికి చెందిన చిరు వ్యాపారులు కమిషనర్ సాయికాంత్‌వర్మకు శనివారం వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ నాయకురాలు, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ యువశ్రీతో కలిసి అయ్యప్ప చిరు వ్యాపారుల సంఘం ప్రతినిధులు కమిషనర్‌ను కలిశారు. ఇటీవల జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు 20 ఏళ్లుగా తోపుడు బళ్లు పెట్టుకుని జీవనం సాగిస్తుంటే తొలగించారని వాపోయారు. దీంతో 50 కుటుంబాలు రోడ్డున పడ్డాయని పేర్కొన్నారు. అదే ప్రాంతంలో రోడ్డుకి దూరంగా తోపుడు బళ్లు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని, లేదా అక్కడి మార్కెట్ యార్డ్‌లో అవకాశం కల్పించాలని కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని వ్యాపారులు తెలిపారు. ప్రభుత్వ స్థలంలో తమ వ్యాపారాలకు స్థలం కేటాయించాలని గాజువాక జెడ్సీకి ఆదేశిస్తామని కమిషనర్ చెప్పినట్లు సంఘం అధ్యక్షుడు ఎస్. కృష్ణ, గణేష్, 69వ వార్డు ఇన్‌చార్జి బగాది సన్యాసిరావు తెలిపారు.

మానవ హక్కుల చట్టాలపై అవగాహన లేదు

డాబాగార్డెన్స్ : మానవ హక్కుల చట్టాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన లేదని రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ల ఆదేశాలు, సిఫారసులు అమలు కావడం లేదని, జిల్లా మానవ హక్కుల కోర్టులు ఏ రాష్ట్రంలో కూడా లేవని ప్రధానమంత్రి కార్యాలయానికి మానవ హక్కుల కౌన్సిల్ ఫిర్యాదు చేసిందన్నారు. బాధితులకు ఉపశమనం లభించడం లేదని, మానవ హక్కుల కోర్టులు హక్కుల ఉల్లంఘన వంటివి విచారించే స్థాయిలో లేనందున ఉత్సవ విగ్రహాలుగా మారాయన్నారు.

ప్రత్యేక అధికారికి అభినందనలు



ప్రత్యేక అధికారి పూర్ణిమాదేవిని అభినందిస్తున్న మీ సేవా కేంద్రాల నాయకులు

మహారాణిపేట : తమ సమస్యలు పరిష్కరించాలని మీ సేవా కేంద్రాల యూనియన్ నాయకులు కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి ఆర్.పూర్ణిమాదేవిని మీ సేవా కేంద్రాలకు విజిలెన్స్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు మీ సేవా కేంద్రాల యూనియన్ నాయకులు పూర్ణిమాదేవిని మర్యాదపూర్వకంగా కలిసి తమ గోడు వినిపించుకున్నారు. అనంతరం పూర్ణిమాదేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీ ఆన్‌లైన్ మేనేజర్ రాజేష్, సీఎంఎస్ మేనేజర్ జోగారావు, యూనియన్ నాయకులు నాగు, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడిపై ఫిర్యాదు

మర్రిపాలెం: తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడిపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం రాసవీధికి చెందిన కంచి ఉషా అనే యువతి.. చంద్రమౌళి కశ్యప్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. వీరిద్దరూ ఓ ప్రైవేటు కాలేజీలో చదువుకున్నారు. ఈ ఏడాది చదువు పూర్తి చేశారు. యువకుడు తనను పెళ్లి చేసుకునేందుకు ఇంట్లో ఒప్పించాడు. తీరా పెళ్లి చేసుకునే సమయానికి కట్నకానుకలు కావాలని పేచీ పెట్టాడు. అవి ఇస్తేనే పెళ్లని.. లేదంటే వేరే సంబంధం చూసుకుంటామని అనడంతో యువతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఉమెన్ ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆశ్రమానికి వృద్ధుని తరలించిన హోంగార్డ్



ఏపీ టూరిస్ట్ పోలీస్ కేంద్రానికి వృద్ధుని అప్పగిస్తున్న హోంగార్డ్ ఉదయ్‌కుమార్

డాబాగార్డెన్స్ : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పని చేసే జోగా ఉదయ్‌కుమార్ శనివారం ఉదయం మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లినప్పుడు అతని కంట ఓ వృద్ధుడు బీచ్‌రోడ్డులో కనిపించాడు. తన స్నేహితుల వాట్సప్ గ్రూప్‌లో ఆ వృద్ధుడినే తాను చూసినట్లు ఉదయ్‌కుమార్‌కు అర్థమైంది. సామాజిక సేవ అభిరుచి గల ఉదయ్‌కుమార్ ఆ వృద్ధుడి వివరాలు తెలుసుకోవాలనుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ వృద్ధుని పేరు నాగరాజు అని, అతని అల్లుడు కంచరపాలెంలో ఉంటాడని తెలిసి ఉదయ్‌కుమార్ ఆ వివరాలపై ఆరా తీశారు. ఫలితం లేకపోయింది. దాంతో ఆర్కే బీచ్ వద్ద ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ టూరిస్ట్ పోలీస్ కేంద్రం దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. వారి సహాయంతో పలు పోలీస్‌స్టేషన్లకు ఫోన్ చేసి మిస్సింగ్ కేసులు ఏమైనా నమోదయ్యాయా అని ఎంక్వైరీ చేశారు. అయితే ఎక్కడా అటువంటివి నమోదు కాలేదని తెలిసింది. దాంతో వృద్ధుడిని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

మహారాణిపేట : వైఎస్సార్‌టీయూసీ యూనియన్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా దుస్తులు మార్చుకోవటానికి వేర్వేరుగా ప్రత్యేక గదులు కేటాయించాలన్నారు. దీనికి సూపరింటెండెంట్ స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షుడు ఒమ్మి లక్ష్మణరావు, కార్యదర్శి ఎ.రామారావు, కోశాధికారి పి.అప్పలస్వామి, జాయింట్ సెక్రెటరీ సిరిపెల్లి రాజారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.పార్వతి, ఎస్‌కే బేగం, ఆర్గనైజర్ సీహెచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో యాంటీ ర్యాగింగ్ వీక్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వీక్‌ను నిర్వహించారు. వారం రోజులుగా విభాగాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టాలు, శిక్షలు, పర్యవసానాలను వివరించారు. ర్యాగింగ్‌కి దూరంగా ఉండాలని, స్నేహపూర్వక వాతావరణంతో మసలుకోవాలని విద్యార్థులకు ఆచార్యులు సూచించారు. విద్యార్థుల్లో మరింత అవగాహన పెంచే విధంగా వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ల తయారీ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమన్వయకర్త ఆచార్య ఏ.ప్రసాద్, విభాగాల ఆచార్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు




సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామ్ ఆచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకరశర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్-2లో గుర్తు తెలియని ఒక వ్యక్తి అనారోగ్యంతో పడి ఉన్నాడు. ఇతడిని గుర్తించిన గవర్నమెంట్ రైల్వే పోలీసులు శనివారం ఉదయం అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించి వైద్య సేవలందించారు. చికిత్స పొందుతూ ఈ వ్యక్తి సాయంత్రం మరణించాడు. జీఆర్పీ సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ మధుసూదన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని, మృతుడి గురించి తెలిసిన వారు రైల్వే స్టేషన్‌లోని రైల్వే పోలీసులకు స్వయంగా లేదా 94406 27547, 94934 74582 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ సిబ్బంది కోరారు.

గురుకుల విద్యార్థులకు సత్కారం



యూఎస్‌లో చదువుకు ఎంపికైన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: విదేశీ చదువులకు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎంపిక వారి ప్రతిభకు నిదర్శమని విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయాధికారిని ఎస్.రూపావతి అన్నారు. ఇటీవల ద కెన్నడి- లూథర్ యూత్ ఎక్సైంజ్ అండ్ స్టడీ ప్రొగ్రాంలో భాగంగా యూఎస్ చదువుకు ఎంపికైన కొమ్మది గురుకుల పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఆర్.ఇవానింజలి, ఎస్.జ్ఞానేశ్వరరావుల సత్కార కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇందులో వెలకట్టలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

సీతమ్మధార : నర్సింహనగర్‌కు చెందిన సీపీ అవధాని ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి నాగుపాము (స్పెక్టికల్ కోబ్రా) చొరబడింది. వంటగదిలోని పోపుల డబ్బాల మధ్య ఇమిడి ఉన్న ఆ పామును శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో చూసి అవధాని కుటుంబ సభ్యులు భయాందోళనకు లోనయ్యారు. వెంటనే గాజువాకలోని స్నేక్ కిరణ్‌కు సమాచారం అందజేశారు. అతను హుటాహుటిన వచ్చి చాకచక్యంగా నాగుపామును బంధించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా స్నేక్ కిరణ్ మాట్లాడుతూ పాములు ఇళ్లలో, కార్యాలయాల్లో చొరబడినప్పుడు భయపడకుండా, 88663-68899 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాల భోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

దిగ్విజయంగా వారాహి యాత్ర

డాబాగార్డెన్స్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ మూడో విడత వారాహి యాత్ర విశాఖలో దిగ్విజయంగా సాగిందని ఆ పార్టీ నాయకులు పీతల మూర్తి యాదవ్, పసుపులేటి ఉషాకిరణ్, పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పవన్ కల్యాణ్ తెలుసుకున్నారని వారు పేర్కొన్నారు.